**నమ్మలేని నిజాలు**

ప్రజాదర్బారు
ప్రజాస్వామ్య కోవెల
నేతోద్ధారణ.
యుద్ధ సందేశం
నియంత రాజ్యదాహం
శాంతి ఏకాకి.
ఏ ఐ విజ్ఞానం
సంపన్న మైన యుగం
జన సౌభాగ్యం.

చెత్తబజారు
శుభలేఖల వీధి
బీరలో నెయ్యి.

బడి కోవెల
కాదు విందుల సత్రం
సదా పవిత్రం.



\- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com
ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433
E-mail:netinijam93@gmail.com

**శ్రీనిజం**

కేంద్ర సాహితి అవార్డు
'అనిమేష' కు వచ్చిందోయ్ !
మొత్తం తెలంగాణాకు
వెన్న వన్నె తెచ్చిందోయ్ !
ఇద్దరం సహ మిత్రులం
శంకరమూ కందుకూరి !
కొత్త ఢిల్లి వచ్చినాము
నందినితో పొందుకోరి !



\- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 2-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:182 పేజీలు:6 వెల: రూ.1/-


## ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. కఠిన చర్యలు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 01: సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిట కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు.

ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది.

ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్లు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది.

ఏవైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## హైదరాబాద్‌లో 10 టన్నుల కుళ్లిన మాంసం సీజ్.. నలుగురి అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 1: నగరంలో ప్రజల ప్రాణాలతో చెల గాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్ ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది.

ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ము కశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రిన్స్‌కు వందోసారి కూడా ఓటమి ఖాయం: మోదీ



గువాహటి, ఏప్రిల్ 01: అస్సాం గత పదేళ్లుగా గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేను మరోసారి రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారనే నమ్మకం తనకు ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గోగముఖ్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడుతూ, ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే అభివృద్ధి, సుస్థిరతకే పట్టంకట్టనున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

'ఈసారి ఎన్నికలు వికసిత్ భారత్ నిర్మాణానికి జరుగుతున్న ఎన్నికలు. అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్ విజయంతో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది' అని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి హ్యాట్రిక్ పరాజయం, ఆ పార్టీ యువరాజు రాహుల్‌కు వందోసారి ఓటమి ఖాయమని చెప్పారు. మూడోసారి ప్రధానిగా తాను హ్యాట్రిక్ సాధించానని, అస్సాంలో బీజేపీని కూడా హ్యాట్రిక్ విజయంతో ప్రజలు ఆశీర్వదిస్తారనే గట్టి నమ్మకంతో ఉన్నానని పేర్కొన్నారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను మోదీ ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో అస్సాంలోని 15 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, ఇంత వరకూ ఇళ్లు రాని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలను కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య కల్పిస్తామన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడాతామని, ఉమ్మడి పౌర స్మృతి అమలు చేస్తామని పేర్కొన్నారు. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఒకే విడతలో ఎన్నికలు జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## నాటో నుంచి తప్పుకునే అంశాన్ని పరిశీలిస్తున్నాం: ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 01: నాటో నుంచి తప్పుకునే అంశాన్ని తమ దేశం పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధంలో నాటో దేశాలు తమకు సహకరించడం లేదని ట్రంప్ ఆరోపించారు. ఈ మేరకు నాటో నుంచి అమెరికా వైదొలిగే ఆలోచనలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక చర్యకు మిత్రదేశాలు మద్దతు ఇవ్వడం లేదని.. వాళ్లు విఫలమైనందు వల్లే ఆ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

నాటో కూటమిని కాగితపు పులిగా అభివర్ణించారు ట్రంప్. నాటో విశ్వసనీయతపై తనకు ఎప్పటి నుంచో చాలా సందేహాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా బ్రిటన్ యుద్ధనౌకల దుస్థితిపై ట్రంప్ నేరుగా విమర్శలు గుప్పించారు. 'మీకు నావికాదళమే లేదు. మీరు చాలా పాతబడిపోయారు. పైగా మీా వద్ద పనిచేయని విమాన వాహక నౌకలు ఉండేవి' అని ఎద్దేవా చేశారు. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ రక్షణ వ్యయాన్ని పెంచాలా? అని సదరు రిపోర్టర్ ప్రశ్నించగా.. తానేమీ సలహా ఇవ్వనని, ఆయనకు నచ్చింది చేసుకోవచ్చన్నారు.

ట్రంప్ వ్యాఖ్యలపై యూకే ప్రధాని..

ట్రంప్ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌ను సదరు పత్రిక ప్రశ్నించగా.. నాటోకు తమ దేశం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. నాటో కూటమిని ఇప్పటివరకూ ప్రపంచం చూసిన అత్యంత సమర్థవంతమైన ఏకైక సైనిక కూటమిగా ఆయన అభివర్ణించారు. కొన్ని రోజులుగా తనపై, నాటో దేశాలపై ఎంతో ఒత్తిడి ఉందన్నారు. తాను తీసుకునే ఏ నిర్ణయమైనా బ్రిటిష్ జాతీయ ప్రయోజనాల కోసమే అని స్టార్మర్ స్పష్టం చేశారు.

## సైబరాబాద్‌లో నేడు మద్యం దుకాణాలు బంద్: కమిషనర్ ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 1: హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం రేపు (ఏప్రిల్ 2) సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్ బార్లను మూసి ఉంచాలని ఆదేశించారు. స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులకు మినహాయింపు ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నేటి నుంచి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం

### వేసవి దృష్ట్యా ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 1:వేసవి దృష్ట్యా ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం పరిధిలో గల అల్మాస్?గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, బడంగ్‌పేట్, జల్‌పల్లి, మామిడపల్లి, బాలాపూర్, కుర్మల్‌గూడ, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి అధికారులు, డీలర్లు సన్నద్ధమయ్యారు. అవసరమైన బియ్యం నిల్వలు ఉన్నందున డీలర్లు తమ షాపులకు తీసుకెళ్లాలని ఇప్పటికే జిల్లా స్థాయి సివిల్ సప్లయిస్ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు డీలర్లు తమ షాపుల పరిమాణాన్ని బట్టి బియ్యం తెచ్చిపెట్టుకున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి నెలాఖరుదాకా ఈ పంపిణీ కార్యక్రమం కొనసాగనున్నది. ప్రభుత్వం డీలర్లకు దశలవారీగా బియ్యం సరఫరా చేయనున్నది.

**ఒక్కొక్కరికి 18కిలోలు**

ప్రస్తుతం రేషన్‌కార్డులు ఉన్న లబ్ధిదారుల్లో ఒక్కొక్కరికినెలకు 6కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబానికి నెలకు 24కిలోలు ఇచ్చేవారు. కాగా ఏప్రిల్‌లో మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఒక్కో వినియోగదారుడికి 18కిలోలు ఇవ్వనున్నారు. ఆ లెక్కన నలుగురు సభ్యులు ఉన్న కుటుంబానికి ఒకేసారి 72కిలోల బియ్యం పంపిణీ చేయనున్నారు.

**ఒక్కొక్కరి వేలిముద్ర మూడు సార్లు..**

ఒకేసారి మూడు నెలల బియ్యం ఇవ్వనున్న నేపథ్యంలో లబ్ధిదారులు ఈ-పోస్ మెషీన్‌లో మూడు సార్లు వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.

దాంతో ఒక్కో వినియోగదారుడికి బియ్యం ఇవ్వడానికి సమయం కాస్త ఎక్కువ పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని లబ్ధిదారులు తమకు సహకరించాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

**బాలాపూర్ మండలంలో 2,324 మెట్రిక్ టన్నులు**

బాలాపూర్ మండలంలో మొత్తం 35,487 మంది సన్నబియ్యం లబ్ధిదారులు ఉన్నారు.

సదరు కార్డుదారులకు మూడు నెలలకు కలిపి మొత్తం 2,324.226 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. ఏప్రిల్ నెలాఖరుదాకా బియ్యం పంపిణీ చేస్తాం.

## హనుమాన్ జయంతికి పటిష్ట బందోబస్తు

హైదరాబాద్, ఏప్రిల్ 1:నగరంలో ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 3,000 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం అనంతరం గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. కార్యక్రమంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ డి.జోయల్ డెవిస్, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీపీలు వైవీఎస్ సుధీంద్ర, సీహెచ్ శ్రీధర్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మల్లేశం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు నరసింహ మూర్తి, రామరాజు, శ్రీకాంత్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సాహిత్య పురస్కారం అందుకున్న డా॥ నందిని సిధారెడ్డి



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకుంటున్న డా॥ నందిని సిధారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 1: (నేటినిజం ప్రతినిధి): ప్రముఖ కవి, రచయిత, సామాజిక, తెలంగాణ ఉద్యమకారుడు డా॥ నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2025 అందుకుకున్నారు. ఆయన రచించిన కవితా సంపుటి **'అనిమేష'**కు ఈ అవార్డు లభించిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీలోని కామిని ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేశారు. కరోనా కాలంలో ఆయన రచించిన 'అనిమేష' దీర్ఘ కవితా సంపుటిని వచన కవిత్వం విభాగంలో ఎంపిక చేశారు. కరోనా కాలపు కన్నీటి దృశ్యాలు, మనిషి ఎదుర్కొన్న జీవన బీభత్సాన్ని 'అనిమేష'లో అత్యంత ఆర్ద్రతతో సిధారెడ్డి ఆవిష్కరించారు. 'ఒక బాధ కాదు, అది సమాజపు సామూహిక వేదన' అని చాటారు. తెలుగు రాష్ట్రాల నుంచి నందిని సిధారెడ్డి ఒక్కరే ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సందర్భంగా నందిని సిదారెడ్డికి తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాలాచారి, డా॥నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, బెల్లంకొండ సంపత్‌కుమార్, ఘనపురం దేవేందర్, వి.పి.చందన్‌రావు, కంధాళై రాఘవాచార్య, మౌనశ్రీ మల్లిక్ తదితరులు అభినందనలు తెలిపారు.

## పుదుచ్చేరి, కేరళలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 1: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యారు.



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆలయ బుధవారం పుద్దుచ్చేరి పర్యటనకు బయలుదేరి వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం, భట్టి విక్రమార్క గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు పుదుచ్చేరిలో విస్తృతంగా పర్యటించనున్నారు. అక్కడ జరగనున్న ఎన్నికల ప్రచార సభల్లో, రోడ్ షోలలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపున్నారు.

పుదుచ్చేరి పర్యటన ముగించుకుని, ఈ నెల 4వ తేదీన కేరళా రాష్ట్రాలనికి వెళ్లనున్నారు. కేరళలోని పతనంతిట్ట నియోజకవర్గంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో భట్టి పాల్గొంటారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల ప్రజలకు వివరిస్తూ ప్రచార జోరు పెంచనున్నారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించి, తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు.

## రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు... కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 01: రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు.

అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు.

పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్ల కు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఎల్పీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు (సౌదీ సీపీ బెంచ్‌మార్క్) 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీలు) ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు.

**చురక**

నింగిమీద ఏ మనిషి
నిజంగా నిలువలేడు
బతుకుదెరువు యుద్ధంలో
బలంగా గెలువలేడు
అవునన్నా కాదన్నా
అదే సదా సత్యము
ఊహల్లో తేలిపోతూ
ఉరకకండి నిత్యము



\-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

మందార మకరంద
మాధుర్య ముసు చిందు
మంచి కవనము విందు
ననును రాధశ్రీ !!
ననతేనియల నొలుకు
గుండె గుండెను కెలుకు
వచన కవితను పలుకు
మనును రాధశ్రీ !!



\-రాధశ్రీ
సెల్:9494481210

## కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కల్వకుంట్ల కవిత..

హైదరాబాద్, ఏప్రిల్ 1:కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సీరియస్ అయ్యారు. రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు.

గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు.



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు కవిత.

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 2-4-2026

## కవితలతో చికిత్స

ఒళ్లంతా గాయాలతో
నక్షత్రాలు మా ఇంటికొచ్చాయి
కూర్చోబెట్టి కవితలతో చికిత్స
కోకిలను పిలిచి పాటలు పాడించాను
తెల్లారి వాటి వెలుగు నా కలంలో సిరాగా



-డా. కె.జి. వేణు
98480 70084

## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ

నీరాటము
వనాటము
పోతన వర్ణించారు వాటి మోక్షార్థ పోరాటము
-కాళిదాసు సుబ్బయ్య, నెల్లూరు

నాడు
నేడు
ఏదో ఒక నాటికి లంచగొండికి మూడు
-చెరుకుపల్లి గాంగేయ శాస్త్రి, రాజమండ్రి

కవిత
వనిత
మన సంస్కృతి సంప్రదాయనీ తీర్చిదిద్దే -భవిత
-కోగంటి(ఉప్పల)శాంతిశ్రీ, హైదరాబాదు





## యుద్ధ పరాభవం

ఆకాశం పగిలింది
భూమి రగిలింది
దేశాల మధ్య
నరాల అనుబంధం నెత్తురుచిందింది.

యుద్ధమా! ఇక ఆగు
అదే ప్రపంచానికి బాగు
ఎవరు గెలుస్తారని కాదు
ఇది మానవత్వానికే పరాభవం
పరాభవానికి ముందు
శ్రీ అనే గౌరవమొకటి!

శీత గ్రీష్మ కాలాల మధ్య
నలుగుతున్న వసంత చీకటి.

కష్టపడి నిర్మించుకున్న
నాగరికత మనది
ఒక్క క్షణంలో
ముగిసిన కతగా మారింది.

యుద్ధమంటే
బద్దలౌతున్న అద్దం
యుద్ధమంటే
రాక్షసక్రీడ

యుద్ధమంటే
దయ్యాల క్రీనీడ
యుద్ధమంటే
క్షతగాత్రుల ఆర్తనాదాలు
యుద్ధమంటే
పసిపిల్లల ఊపిరి ఆగిపోవడాలు.

ఆధిపత్యం వల్ల
మిగిలేది శూన్యమే
జీవితాలన్నీ రక్తసిక్తం
మరణాల సంఖ్య కాదు
శరణార్థులూ అసంఖ్యాకం.

ఓడిపోతున్నదెవరు?
వాడిపోతున్నదెవరు?
మనిషి!
తప్పదు మనిషిని గెలిపిద్దాం
ఆయుధ విన్యాసాలను నలిపేద్దాం
ప్రతిజ్ఞ చేద్దాం
రండి యుద్ధాన్ని నాశనం చేద్దాం.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496



# ఈ మట్టినీ, మనిషినీ గానం చేస్తున్న కవి నందిని సిధారెడ్డి

కవిత్వ మర్మాలెన్నున్నా కవిత్వ ధర్మ మొక్కటే వుంటదనీ, అది సహాజాతి సహజమైనదనీ, సత్యప్రకాశితమైనదనీ, మీన మేషాలు లెక్కించని ప్రకృతి స్పందన లాంటిదనీ ఎరుక, నమ్మిక వున్న కవి యోధ నందిని సిధారెడ్డి.. అందుకే తొల్తనే "కలలు అందంగానే వుంటాయి, మరి కన్నీళ్ళ మాటేమిటి"? అన్న ప్రశ్నను కవి లోకం ముందుంచిండు. శైలీ, శిల్పం, నైపుణ్యం, ప్రయోగం ఇత్యాది హంగులు, మెరుగుల అద్దకం పట్ల మోజు లేని తనవే ఆర్ద్రత, తీవ్రత (సినారె అన్నట్లు)ల కవిత్వమనీ. పాప ఏడ్చినట్లు, పువ్వు నవ్వినట్లు, ఊట ఉబికినట్లు, అవ్వ జోలెలో తెచ్చిన పెసర కాయల తీపిని, బాపు తుడిచిన దుఃఖ భారాన్ని కవిత్వ జాడగా అడుగు లొత్తిండు. నేల విడిచి సాము చేయని అక్షర సంపద సృజించిండు. ఇంకా ధైర్యంగా ప్రజా జీవితం నుండే పలుకులు ఏరుకుంటానని, జనం నాలుకలోనే, నానుడిలోనే కవిత్వ ముందనే వాస్తవాన్ని మనసా, వాచా, కర్మణా నిరూపితమైన నిజాయితీపరుడు. 80 వ దశకంలోనే ప్రాంతీయతా, వామపక్ష దృక్పథ గామిగా పలు కవితల్లో రవి, కవి గాంచని మూలాలను ఎత్తి చూపి, కవిత్వ ఆవశ్యకత, ప్రయోజకత్వాలకు పెద్దపీట వేసిండు. తొలి పుటల్లోకి వెళితే?

మౌనం ఓటమికి సంకేతంగా, దుర్బలత్వానికి ప్రతీకగా, భయానికి వెరపుగా, దౌర్జన్యాన్నెదిరించలేని చేతకానితనంగా చూస్తం, భావిస్తం. "గోడకు వేలాడే తుపాకి కూడా మౌనంగానే వుంటుంది." తిరుగు అర్థంలో ఈ కవితా వాక్యం పదునే మీటో గ్రహించినప్పుడు పఠిత కళ్ళు మెరుస్తయి. ఒళ్ళు గగుర్పాటుకు లోనవుతుంది. ఇది వరకు అనుభవంలోకి రాని కొత్త చైతన్య వేదో బతుకు గమనింపులోకి ప్రవహిస్తది. ప్రమత్తతా అప్రమత్తతల మధ్య గీతని చెరిపి వేస్తది. నిస్తబ్ద దృశ్యాన్ని శబ్దబేధి గా తర్జుమా చేసే కలమూ, మౌనంలో మౌనాగ్నిని చూడ గలిగే నేత్రమూ తనది.

బాధను, వేదనను దృశ్యమానం చేసేది కన్నీరు. దేహానికైనా మనసుకైనా నొప్పి కలిగితే ఏడుపే ఉబికేది. బాధలు, అవమానాలకు ప్రతిస్పందన దుఃఖం. "ఏడువాలని లేదు" అని ధీరోదాత్తుడైన ఈ కవే అనగలడు. ఏడ్పు చీకటిలో మ్రగ్గటం ఇష్టముం దదు. నిరాశా పూబిలో గ్రుక్కటం సహించదు. వారసత్వ రక్తకణమేదో కర్తవ్య బోధ లోపల్లోపల సుళ్ళు తిరుగుతుంటది. "చిలుక చిన్నబోయి కూచుందంటే ఏం చెబుతుందమ్మా, నువ్వు, బాపు వాళ్ళ కన్నీళ్ళు తుడవ లేదా, ఏడువాలని లేదు, తీపిగానో చేదుగానో పాడదల్చు కున్నాను." బతుక్కిచ్చే అవసరమైన, అసలైన నిర్వచనం ఏదైనా వుందంటే ఇదే, ఈ పాటింపే. శీర్షిక కవి దృక్ప థాన్నే కాదు జీవన పథాన్ని, ఎంచుకునే తీరుని ప్రత్యేకంగా నిలుపుతది.

వివక్ష, చిన్నచూపు, తృణీకారం మనిషిని అంటని మనిషిగా చూసే మానసిక వికారపు కుల సంప్రదాయ బుద్ధిని, చర్యను ప్రశ్నిస్తున్న "మా కెవరు నేర్పింద్రు తండ్రీ" కవిత. ఊహల ఊయల కట్టి, ఊగుతూ, కవి ధర్మ వచనాలు పలుకుతూ ఎక్కడో వుండడు. కళ్ళ ముందటి దార్ష్టీకాలను, చరిత్ర పేజీల కప్పి పెట్టిన మార్మికాలను, వొలిచి పెడుతూ మౌఢ్యం పొరలను కరిగించే ఆత్మ విమర్శకు గురి చేస్తడు. సున్నితమైన వ్యంగం శైలీ ప్రభావంగా పోయెం నడుస్తుంటది. దళితావమా నానికి గొప్ప వూరటగా, అగ్రాహంకా రానికి పుట్టించిన చెమటగా సాధించిన ప్రయోజనం.

**"మా కున్నవి రెండు చేతులే."** ఇవే దునియాని బతికిస్తున్నవి. జ్ఞానవంతులు బంగారు స్పూన్ ఫీడింగులై, సోమరులై, పీడకులై చెలరేగి పోతుంటరు. పొలం పర్రెలు వారితే, బొచ్చె గుద్దుకుంటూ, వాన కోసం మొగులు చూసే కాపు ఎవరికీ పట్టి కాడు. ఆరుగాలపు కాయకష్టం ఎక్కసానికి గురౌతుంటది.

ఆ రెండు చేతుల శ్రమని, ఆత్మాభిమానాన్ని పలవరించిన తీరు కళ్ళు తెరిపిస్తది. శక్తి మహత్యాల ప్రాశస్త్యం ఆ రెండు చేతుల్లో కవితై సాహసికంగా సాక్షాత్కరిస్తది.

ఏ అక్షరం, పదం, వాక్యం, కవిత వూరకే, అలవోకగా, కృత్రిమంగా, అనవసరంగా, అంతంతమాత్రంగా రాయబడదు. గిరి గీసి, బరి గీసి , పురి విప్పి ప్రకృతికి, ప్రజకి కొత్త శ్వాస, ఆశ, ఆశయం

అందించటానికే జవసత్వాల పుటక పుట్టినట్లు ప్రభవించే కవిత్వం సమరశీల గాయాల గొంతుక లోంచే.

న్యూనతలో ముంచి, అవహేళనతో విర్రవీగే భావాస్త్రాన్ని **"తలెత్తుకునే వున్నం"** అన్న సహజ అస్తిత్వ కవచం తుత్తినియలు చేసింది.

జాతి జనుల మంత్రంగా మోగింది. సంస్కృతి, పరం పర, నడక ప్రత్యేకతల ఘనత రొమ్ము విరిచింది. వాగుడు నోళ్ళకు మూతలు పెట్టింది.

ఏ సృజనకారుని నుండీ బాల్యం తప్పించుకోదు. మెరుగుల బాల్యం కొందరిదైతే చిరుగుల బాల్యం ఎందరిదో. ఆ ఎందరి బాల్యమో **"బాలుని ఆత్మగీతం"** అయ్యింది. పలక పట్టే చేతులే కార్లు తుడుస్తయి.

కలిగినోల్ల 'సన్నీ' పిల్లాడితో క్రికెట్ ఆడలేదా బాల్యం. ఇప్పటికీ ఆ కవిత లోపలి వాక్యాలు ఇటీవల తులసీచందు గారు (జర్నలిస్టు) చేసిన వీడియో జవహర్ నగర్ లో చెత్త కుప్పల మధ్య లక్ష పిల్లల చుట్టూ తిరుగుతూ, సమాజాన్ని నిలదీస్తూనే వున్నయి.

**"పసిపాపల నిదుర కనులలో మురిసిన భవితవ్యం ఎంతో"** పక్కన నిలబడ్డ కలం కదా మరి..

తనకు మాలిన ధర్మం కవికి పొసగదు. నేల మీదే రాత రాస్తడు. చేత చేసిన మట్టినే బొట్టు పెట్టుకుంటడు. మట్టిలో పుట్టిన 'రేషం' అద్ది పద్యం ఎగరేస్తడు.

అంతేకాదు, మట్టి త్యాగాన్ని, వైభవాన్ని, విషాదాన్ని, అణచివేతని, సాహసాన్ని, అమాయ కాన్ని, పానం పెట్టే ప్రేమని, అంబరం అంచుల దాకా గానం చేస్తడు. **"తెలం గాణ మట్టి"** , **"నాగేటి చాల్లల్ల"** పాటల సృజన తెలంగాణ తల్లి కలంకారంగా పూదిచ్చిన మట్టి కిరీటం పొదిగినట్లే. మనిషి నెన్నుదురు అన్చి ధ్యానించినట్లే.

దేహాన్ని మాత్రమే గాదు ఆత్మని ఇవ్వగలిగే నాయినలు ఎందరు? కత్తులూ, కన్నీళ్ళతో జీవించమని బోధించే బాపులు ఎవ్వరు? కాసులో, హోదాలో కన్నా వొడవనిదే ఇచ్చిన **'నాగేటితరం'** వారసత్వం ఈ మట్టి కవిదే.

పాదాలకు పాదాలు కలిపి నడిచిన నడకలు పదిలంగా దాచుకుని, కొనసాగించటం అసిధారా సిరా వ్రత దీక్షనే. అలవి మాలిన ఆపేక్షనే.


మార్పైతే వుంటది. గాలివాటు మార్పూ వుంటది. కానీ, ఈ కవి హృదయం ప్రకృతికి ఆలవాలమైంది. సముద్రం కెరటాల చెలిమి మాను తుందా. గాలి వీచి మనిషిని ఊయల లూపకుండా వుండగలదా. గుట్టలు, లోయలు ఎత్తూ లోతుల నెందుకు ప్రేమిస్తయంటే ఏం చెబుతయి. ఏ కొలమానాలు పనిముట్లు?. దూరాలు, దగ్గరలు కంటికా, మనసుకా. అక్షరం వంగదు, లొంగదు. ధృడమైనదే, గాఢమైనదే. మనిషిని చేరుకుంటూనే వుంటది. మారిందనుకుంటే మారినట్లే. మారలేదనుకుంటే మారనట్లే. కవి స్వగతం లోకం తెరమీద అల్లుకున్నదే. రాసుకున్నదంతా పరుసుకున్నదే తెలుసుకున్నదే. మరెక్కడా వింత?

కవిత్వంతో వ్యక్తిత్వం రూపు దిద్దుకొంటుందా. లేదా వ్యక్తిత్వంతో కవిత్వం రూపు కడుతుందా. తేలే విషయ మైతే కాదనుకుంట. రెండూను సహజత్వంతో మేళవింపే, ఇమిడింపే అరుదైన అద్భుతం.

80, 90 ల నాటి కవిత్వ కాంతులే ఎత్తొంపుల్లో ఎట్లా ప్రసరించినయో, ఏ పిల్లతొవ్వల, తొవ్వాపువ్వుల స్పర్శించినయో, ఏ మట్టి నమోనా ముద్రించి, ముద్ర వేసిందో

అదే అదే ఏ అవార్డులకైనా అతీతం. ఈ నేలకీ, మనిషికీ ఎప్పటికీ ప్రీతిపాత్రం.

(మార్చి 31, 2026న నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు అందుకున్న సందర్భంగా)




-దాసరాజు రామారావు
సెల్:9618224503




మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకుంటున్న డా॥నందిని సిధారెడ్డి.

> "కవిత్వ మర్మాలెన్నున్నా కవిత్వ ధర్మ మొక్కటే వుంటదనీ, అది సహాజాతి సహజమైనదనీ, సత్యప్రకాశితమైనదనీ, మీన మేషాలు లెక్కించని ప్రకృతి స్పందన లాంటిదనీ ఎరుక, నమ్మిక వున్న కవి యోధ నందిని సిధారెడ్డి"

> "కవిత్వంతో వ్యక్తిత్వం రూపు దిద్దుకొంటుందా. లేదూ వ్యక్తిత్వంతో కవిత్వం రూపు కడుతుందా. తేలే విషయమైతే కాదనుకుంట"





## యుద్ధాలొద్దు సుమా...!

అగ్రరాజ్యాలంబనం
ఉగ్రవాద రణ హననం
ప్రాణనష్టమేపరిహాసమా
ధననష్టమేదరహాసమా!

ఏ దేశమైతేనేమి
ఈ ద్వేషాలెందుకోయ్!
నరవధల బలిమియేమి?
పరదేశాల పతనమెందుకోయ్!!

అన్నెంపున్నెంతెలియని
జనప్రాణులమృత్యుహేల
తెగిపడిచేసేయుద్ధజ్వాల
అగుపించు భీకరార్తనాదాలు..

దేశాలను దేశాలే వెర్రి
వేషాలతో రగులుతుంటే
తంత్రాలు,కుత్రాంతాలు
యంత్రాలై జనుల చంపేస్తున్నాయ్!

ఉన్నవారు లేనివారు
కన్నవారి కడుపు కోత
అవిటితనాన కొందరు
చెవిటితనాన మరెందరో!

కన్ను మిన్ను కనరాని
వినని విస్ఫోటాలెన్నో
అగ్రరాజ్యమా మానుకో
విర్రవీగుట వదులుకో!

చాలు చాలు యుద్ధాలు
మేలునిచ్చు సుఖశాంతులు
ప్రాణాలతో చెలగాటమేల?
అణ్వాయుధాలొద్దికను!


ఎగరాలోయ్ శాంతికపోతం
రావాలోయ్ సమతాగీతం
మానవత మమతలు విరిసే
సామరస్యమే బహుమేలోయ్!!

మానవత్వం మంటకలుపు
దానవత్వం ప్రబలిపోయే
ఉన్మాదమౌ యుద్ధాలు
ఘనమౌనా ప్రపంచానా...!



-డా.గన్నోజు శ్రీనివాసాచారి
8555899493

## మళ్లీ కట్టెల పొయ్యి !?



అగ్ని మిళే పురోహితం;
అగ్ని భట్టారకుడు ఈ పరాభవ నామ సంవత్సరానికి
కట్టెల పొయ్యి మీదే భక్ష్యాలు
పెనం పెనమంతగా ఊరు వాడ
చేస్తున్నాడు !
అంతా అగ్ని ప్రతాపమే!!.
ఓటమి సిలిండరుదా ?
గెలుపు కట్టెలదా?.
మళ్లీ తాత ముత్తాతల నాటి
కట్టెల పొయ్యి పైని వంటకాలు
షడ్రుచుల సమ్మేళనంగా
డైనింగ్ టేబల్ పై పండగ
పాక శాస్త్ర ప్రావీణ్యం!.
గ్యాసు పొయ్యి వంటకాలు
మాటి మాటికి "హై లు సిమ్ "లతో
ఎటు కాని రుచులు!.
గతి తప్పి మతి తప్పి
మాడు మాడు దోడు దోడు పారేసుడు!
గ్యాసు సిలిండర్ నిజంగానే
సామాన్యునికి అసామాన్య ధరతో
వంటింటికి దడికట్టినట్లేంది!
గుండె దడగా బండకు బండ!
ఎర్రరంగు సిలిండర్ డేంజర్‌గా సార్థకమైంది!
ముద్దుగారే ముగ్గువేసి
మళ్లీ కట్టెల పొయ్యి ముట్టించాల్సిందే
అగ్ని సూక్తం పఠించాల్సిందే!.
కట్టెల పొయ్యి వాడితే
సముచితంగా బొగ్గులు ఉచితం!
బొగ్గులు పొయ్యి వాడవచ్చు
రసాయనాలు కలవని మంచి
బూడిద కూడ ఉచితం !
మసి గిన్నెలను తళతళలాడే
తెలుపుగా తోమవచ్చు
రక్షిత బూడిద !!.
ఇల్లాలు తన ముఖ బింబాన్ని పళ్లెంలో
నిండుగా చూసుకోవచ్చు
"సెల్ఫియే "మరి నిండు పళ్లెమంత!!
కట్టెల పొయ్యి పై అన్నం మెల్లగా
ఉడుకుతుంటుంది...తుక తుక
తొందర లేదు
పొంగే ప్రమాదం లేదు
ఉడికేంతలో అమ్మ అన్నీ పనులూ చేసుకోవచ్చు
పక్కింటి వారితో "కష్టాల్ నష్టాల్
కోపాల్ తాపాల్ "చెప్పుకోవచ్చు
ఉభయతారకం!!.
కట్టెల పొయ్యి సిలిండర్ లా
"ధన్" మంటు మంటగా పేలదు
కట్టెల పొయ్యి క్షేమంకరి!.
మనం బాల్యంలో కట్టెల పొయ్యి
మీదే వండిన
ఉగ్గు బువ్వ అవ్వ చేతితో తిన్న వాళ్లమే కదా
బొగ్గుల పై మక్కకంకి కాల్చి
చేతులు కాల్చుకున్న వాళ్లమే!
స్వాగతమా కట్టెల పొయ్యి సుస్వాగతం!.
ఇపుడు తెల్లవారితే గ్యాసు...
గ్యాసు అంటూ అష్టోత్తర
శత నామావళి పఠిస్తున్నాం
ఆగని యుద్ధయుద్ధంగా మనసు!!.
ఏ యుద్ధమైనా ప్రపంచమంతగా
అందరి పరాభవం !
సామ్రాజ్యవాద దేశాలు
స్మశానాలను ఏలుతాయి !
అంతా బూడిద సంపద !.
ఏదో పొగ పొగ వాసన మా ఇంట్లో
ఓహో! అమ్మ కట్టెల పొయ్యి
వెలిగించింది !!



-కందాళై రాఘవాచార్య
87905 93638

## పోరుబాట

'వినాశకాలే విపరీత బుద్ధి'
అన్నారు పెద్దలు
ఇరాన్ అణుబాంబులతో విర్రవీగుతోందని
అంతం చేసి ఆనందపంచాలంటున్న
అగ్రరాజ్యం
పసిపిల్లలు, సైనికులు,
ఎందరో ప్రజల ప్రాణాలు గాలిలో
కలిసిపోయినా పట్టనివైనం ఎన్నెన్ని కుటుంబాల రోధన,
వేదన మిన్నంటుతున్నదో
తలుచుకొంటే ఆగని కన్నీరు-
'పెరుగుట విరుగుట కొరకే' అన్నట్లు
ఆధిపత్యంతో అలివికాని సుంకాలతో
ప్రపంచాన్ని వణికిస్తూ పబ్బం గడుపాలనుకుంటున్నా,
మూల్యం చెల్లించే రోజు ఏదో ఒకనాడు రాకమానదు
అన్ని రోజులు మనవికావన్న
ఆలోచనలే అక్షరసత్యం-
ఆకాశహర్మ్యాలుఅవనిలో కలవగా...
చమురునిక్షేపాలు అంతమే అవ్వగా,
సంపదంతా సర్వనాశనం అవుతుంటే,
అన్నీ కోల్పోతున్న ప్రజల జీవనం
అతలాకుతలమవుతుంటే యుద్ధాలకు మద్దతివ్వక
దాడులను అరికట్టగ అడుగులువేయాలి-
ఆధిపత్యాలు అవధులు దాటకుండా,
పొరుగువారి మేలును కోరుతూ,
ఐకమత్యపు బాటలో, శాంతియుత చర్చలతో,
వివాదాలు పరిష్కరించుకొని
విజ్ఞులుగా నిలిస్తేనే మానవ మనుగడ



-బండారి సుజాత
9959771228

## మేలుకోనంత కాలం

దేశమంతటా కులం కంపు, మతం రొచ్చు
మూఢనమ్మకాల మురికికాలువలో
విచ్చలవిడిగా దొర్లుతోంది దేశం
మానవతా వస్త్రాలను విప్పేసుకొని
అమానవీయతను అంటించుకొని
ఊరేగుతోంది దేశం.
ఓ వైపు
విషంలా వ్యాపిస్తున్నది కులమతాల పిచ్చి
పేట్రేగిపోతున్నది ఉన్మాదం
మరోవైపు
మనమేమో ఉగాది ఉత్సవాలంటున్నాం
ప్రభుత్వాలేమో ఊదరగొట్టు ఉపన్యాసాలిస్తున్నాయి.
మామిడి పిందెల్ని కాదు
పొత్తికడుపులోనే కరిగిపోతున్న పిండాల్ని చూడండి
కోకిల కూతల్ని కాదు
నలిగిపోతున్న మగువల ఆర్తనాదాల్ని వినండి
చెరుకుగడల్ని కాదు
చేదెక్కుతున్న బాల్యజీవితచిగుర్లని పరికించండి
వేపపువ్వుల్ని కాదు
లేతనవ్వులు చిదిమేయబడుతున్న దృశ్యాన్ని
గమనించండి
భక్ష్యాల్ని భుజించడం కాదు
మన బతుకుల్ని భక్షిస్తున్న
బకాసురులెవరో గ్రహించండి
మేలుకోనంత కాలం
పెను నిద్దుర వదులుకోనంత కాలం
చైతన్యవంతమవనంత కాలం
అసలైన ఉగాదులుండవు
ఆ నవయుగమెంతో దూరమే!
చేరుకోలేని గమ్యస్థానమే!

-కార్తీక రాజు
8977336447

## గజల్

జీవితంలో బాధలన్నవి గాయంతోనె కద తెలిసేది
మనసులోనీ భావమేదో చూపులతోనె కద తెలిసేది
అమవసనాటి ఆకాశాన వెలుగులేదని విచారించకు
జాబిల్లిలో సొగసులేవో వెన్నెలతోనె కద తెలిసేది
ఎవరికైనా వయసురాకను దాచుకుంటే దాగదెపుడూ
మగువ మనసున నిండినవలపు బిడియంతోనె కదతెలిసేది
వీరత్వమో ధీరత్వమో చెప్పుకుంటే సరిపోదుగా
కండబలమూ గుండెబలమూ చేతలతోనె కదతెలిసేది
సంతోషమే సగంబలమని తలిచినపుడే మనిషికిహాయి
'చక్రి'ఎదలో ఆనందాలు నవ్వులతోనె కదతెలిసేది



-డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి, 9849331554

## "అక్షర సేద్యగాడికి ఉగాది నీరాజనం"

# వలేటి గోపీచంద్ గారి అసాధారణ ప్రస్థానం



**'పాడి - పంట పెద్దయ్య' గా అశేష జనాభిమానం పొంది, ఆకాశవాణి వ్యవసాయదారుల కార్యక్రమాలకు తన ప్రత్యేక స్వరంతో వన్నె తెచ్చిన ఆకాశవాణి పూర్వ కార్యక్రమ నిర్వహణాధికారి వలేటి గోపీచంద్ గారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం వరించింది. గోపీచంద్ గారు పురస్కారం స్వీకరించిన సందర్భంగా ఆకాశవాణి పూర్వ కార్యక్రమ నిర్వహణాధికారి ఎన్.విజయరాఘవ రెడ్డి గారు రాసిన వ్యాసమిది. వ్యవసాయ జర్నలిజం విభాగంలో తొలిసారిగా గోపీచంద్ గారు ఈ పురస్కారం స్వీకరించడం విశేషం.**

సమాజం ఒక నిరంతర గమనశీల ప్రక్రియ. కాలం తన స్వరూపాన్ని మార్చుకుంటూ ముందుకు సాగుతుంటే, మనుషులు కూడా ఆ ప్రవాహంలో భాగమవుతారు. అయితే కొందరు వ్యక్తులు ఆ ప్రవాహానికి లోనవుతారు.. మరి కొందరు ఆ ప్రవాహాన్నే మలిచే శక్తులుగా అవతరిస్తారు.

ఆ రెండో వర్గానికి చెందిన అరుదైన వ్యక్తి శ్రీ వలేటి గోపీచంద్

అక్షరాన్ని నమ్ముకుని, మట్టిని ప్రేమించి, గొంతుకను సామాన్య రైతుకు అండగా నిలిపిన అరుదైన వ్యక్తిత్వం శ్రీ వలేటి గోపీచంద్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026 'పరాభవ' నామ సంవత్సరానికి గాను ఆయనకు ఉగాది పురస్కారం ప్రకటించడం, ఒక వ్యక్తికి జరిగిన సత్కారం మాత్రవే కాదు.. అది దశాబ్దాల తరబడి సాగుతున్న వ్యవసాయ పాత్రికేయతకు, రైతు చైతన్యానికి, అక్షర సాధనకు సమాజం ఇచ్చిన గౌరవప్రదమైన అభినందన.

### మట్టితో మమకారం- అక్షరంతోఆత్మసాధన

వ్యవసాయం అనేది కేవలం వృత్తి కాదు, అది జీవన తత్త్వం. బాపట్ల వ్యవసాయ కళాశాల అందించిన క్రమశిక్షణే గోపీచంద్ గారి ప్రస్థానానికి పునాది. కేవలం డిగ్రీ పట్టా పుచ్చుకుని ఆగిపోకుండా, ఆ మట్టిపై మమకారాన్ని వృత్తిగా మార్చుకున్న నిబద్ధత ఆయనది. ఆకాశవాణిలో మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో ఆయన గొంతుక కోట్లాది మంది రైతులకు దిశానిర్దేశం చేసింది. పదవీ విరమణ చేసినా, ఆ బాధ్యత నుంచి ఆయన విరామం తీసుకోలేదు. "రైతు ప్రాణం.. అక్షరం నా శ్వాస" అన్నట్లుగా ఆయన కలం సాగుతూనే ఉంది.

రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన గోపీచంద్ గారు, నేల వాసనను కేవలం తెలుసుకోవడమే కాకుండా దాన్ని అక్షరాల రూపంలో నిలబెట్టే కర్తవ్యాన్ని స్వీకరించారు.

చాలామంది విద్యను ఉద్యోగానికి పునాది చేసుకుంటే, ఆయన దానిని సమాజానికి సేవగా మలిచారు. మట్టిలోని తేమను, రైతు కష్టంలోని నొప్పిని, పంటలోని ఆశను అన్నింటినీ తన కలంలో కరిగించి ప్రజలకు అందించారు.

ఆకాశవాణిలో ఆయన చేసిన మూడు దశాబ్దాల సేవ ఒక ఉద్యోగ ప్రయాణం కాదు. అది ఒక మౌన విప్లవం.

గ్రామాల్లో, పల్లెల్లో రేడియో వినిపించిన ప్రతిసారి గోపీచంద్ గారి స్వరం రైతుకు మార్గదర్శకంగా నిలిచింది.

విత్తనాల ఎంపిక నుంచి పంటల సంరక్షణ వరకు, మార్కెట్ అవగాహన నుంచి ఆధునిక సాంకేతికత వరకు అతని మాట రైతుకు ఒక నమ్మకం, ఒక దిక్సూచి.

పదవీ విరమణ తర్వాత కూడా ఆయన ఆగలేదు. ఎందుకంటే అది ఉద్యోగం కాదు,అది ఒక జీవన ధ్యేయం.

"రైతు కోసం మాట్లాడటం నా బాధ్యత కాదు... అది నా శ్వాస" అనే భావజాలం ఆయన లో నిరంతరం ప్రవహిస్తోంది.

గోపీచంద్ గారు కేవలం మాట్లాడటమే కాదు, భావితరాల కోసం చరిత్రను భద్రపరిచారు.

"రైతన్నకు వెన్నుదన్ను" - వ్యవసాయ పాత్రికేయుల సేవలను వెలుగులోకి తీసుకువచ్చిన అద్భుత కృషి. ఇది కేవలం వ్యక్తుల పరిచయం కాదు; ఒక రంగానికి చరిత్ర రాసిన పుస్తకం.

"ఒక నేల- అనేక ఆకాశాలు" తన విద్యాసంస్థకు అర్పించిన అక్షర నివాళి. ఇది ఒక కాలేజీ కథ మాత్రమే కాదు,అది వ్యవసాయ విద్య అభివృద్ధికి ప్రతీక.

బాపట్ల వ్యవసాయ కళాశాల 75 ఏళ్ల సుదీర్ఘ చరిత్రను, అక్కడి నుండి వచ్చిన 200 మంది ప్రముఖుల జీవన రేఖలను' వెలుగు దివ్వెలు **'వెలుగు తోవలు', 'వెలుగు పూలు'**గా అక్షరబద్ధం చేయడం ఆయన పరిశోధనా తృష్ణకు నిదర్శనం.

ఈ రచనలు చదివితే తెలుస్తుంది.. ఆయన కలం కేవలం వర్ణించదు, అది బాధ్యతను గుర్తుచేస్తుంది.

గోపీచంద్ గారి ప్రయాణం పదవీ విరమణతో ముగియలేదు. అది 'ఒక అన్వేషి ప్రయాణం'గా నిరంతరం కొనసాగుతూనే ఉంది.

సాధారణంగా సాహిత్యం, కళలకు దక్కే ఉగాది పురస్కారం ఈసారి ఒక వ్యవసాయ ప్రసారకర్తకు దక్కడం విశేషం.

ఇది ఒక వ్యక్తికి లభించిన గౌరవం కాదు; ఇది రైతు జీవనాన్ని, వ్యవసాయాన్ని, గ్రామీణ సంస్కృతిని గుర్తించిన సమాజపు విజ్ఞత.

"ప్రపంచమంతా ఆయనకు మిత్రులే" అన్నది అక్షర సత్యం. పదవీ విరమణ సమయంలో ఆయనకు దక్కిన గౌరవం ఒక వ్యక్తికి దక్కినది కాదు, ఆయన పాటించిన విలువలకు దక్కినది. తన వృత్తిని కేవలం జీవనోపాధిగా కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా భావించిన వలేటి గోపీచంద్ గారికి ఈ ఉగాది పురస్కారం దక్కడం 'అక్షరానికి దక్కిన ఆభరణం'.

గోపీచంద్ గారి వినమ్రత ఆయన మహోన్నతతకు నిదర్శనం.

ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఆయన చెప్పిన భావం ?

"ఇది నా గౌరవం కాదు? ఆకాశవాణి, దూరదర్శన్ వేదికలపై రైతు కోసం శ్రమించిన అందరి కృషికి వచ్చిన గుర్తింపు"

**అతని వ్యక్తిత్వాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్తుంది.**

**వలేటి గోపీచంద్ గారు ఒక రచయిత మాత్రమే కాదు, ఒక ఆలోచన.**

**ఒక ప్రసారకర్త మాత్రమే కాదు, ఒక ఉద్యమం.**

**ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ.**

**ఆయన అక్షరాల్లో మట్టి పరిమళం ఉంటుంది.**

**ఆయన స్వరంలో రైతు శ్వాస వినిపిస్తుంది.**

**ఆయన రచనల్లో భవిష్యత్తుకు మార్గదర్శనం ఉంటుంది.**

**ఉగాది అనేది కొత్త ప్రారంభాలకు సంకేతం.**

**అలాంటి రోజున గోపీచంద్ గారికి లభించిన ఈ గౌరవం, కొత్త తరానికి ఒక సందేశం:**

**"అక్షరం సార్థకమవ్వాలంటే అది సమాజానికి సేవ చేయాలి."**

**సమాజం మారడానికి పెద్ద ఉద్యమాలు అవసరం లేదు;**

**ఒక నిజాయితీ గల కలం, ఒక నిబద్ధత గల స్వరం, ఒక సేవా భావం చాలు.**

**వలేటి గోపీచంద్ గారి ప్రయాణం అదే నిరూపించింది.**

**ఆయన కలం ఇంకా ఎన్నో పంటలు పండించాలి.**

**ఆయన స్వరం ఇంకా ఎన్నో రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలి.**

వలేటి గోపీచంద్ గారు ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ. ఆయన అక్షరాల్లో మట్టి పరిమళం ఉంటుంది, ఆయన మాటల్లో రైతు ఆవేదనకు పరిష్కారం ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనను గుర్తించడం ద్వారా ఉగాది పురస్కా రానికే వన్నె తెచ్చింది.

శ్రీ వలేటి గోపీచంద్ గారు మరెన్నో శిఖరాలను అధిరోహించాలని, ఆయన కలం నుండి మరిన్ని అద్భుతాలు జాలువారాలని మనసారా ఆకాంక్షిద్దాం.

అక్షర సేద్యగాడికి అక్షర నీరాజనం!




**- యన్.విజయ రాఘవ రెడ్డి**
9441239803

## సారూప్యం

రైలుబండి నుండి నెట్టివేయబడిన
మా గాంధి "కొల్లాయి గట్టితే నేమి"!
మహాత్ముడయ్యాడు.
"ఆంధ్రులు ఆరంభ శూరు"లని విన్న పౌరుషంతో
ఆంధ్ర రాష్ట్ర సాధనకై ఆత్మార్పణతో
అమరజీవయ్యాడు పొట్టి శ్రీరాములు.
న్యూనతా భావం లేని నాణ్యతా గుణాల బ్రహ్మతేజస్వి
నెట్టి వేయబడినా, నాటి తెల్ల దొరల నెట్టివేత.
ఒక్క సంఘటనతో, ఒక్క అవమానంతో,
ఒక్క దెబ్బతిన్న అభిమానంతో, ఒక్క క్షణ మార్పుతో,
అవధులనధిమించిన ఆగ్రహ జ్వాలలతో,
మదిలో మెదిలే ఆరాటంతో
పోరాడితే పోయేదేంలేదన్న స్ఫూర్తితో,
పోరాట పటిమతో, దీర్ఘకాల దీక్షతో
ఒకరిది "సత్యాగ్రహ" మైతే
మరొకరిది "నిరాహార దీక్ష"
ధ్యేయం, లక్ష్యసిద్ధి.
ఒక అహింసావాదిని "హింస" అంతం చేస్తే,
ఒక రాజకీయ "నిర్ణయ జాప్యం"
నిరాహార దీక్షుని అంతం,
అమరజీవి ఆత్మార్పణతో ప్రత్యేక రాష్ట్ర సాధన.
వారిది ఒంటరి పోరాటం, ఒంటరి శ్రమ గమనం.
పట్టుదలతో లక్ష్యం వైపు పయనం,
చివరికి చిక్కి శల్యమై చివికి పోయిన శరీరం,
గావించింది ఆత్మార్పణం, అర్పించింది స్వరాష్ట్రం
అమరజీవి త్యాగం, సంకల్ప సిద్ధి, కార్యదీక్ష
భావితరాలకు స్ఫూర్తిదాయకం.

(మార్చి 16 శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా)



**-వేదం సూర్యప్రకాశం**
సెల్: 98661 42006

## అక్షరాలు


అక్షరాలే ఆయన్ను
అక్కర చేర్చుకొని ఎల్లయ్యను
ఎలిగెత్తి చాటాయి
మాయమౌతున్న మనిషి ని
చూపిన దిగ్గజం
ఉద్యమఉధృతికి మాట, బాట
స్ఫూర్తి తో జయహే తెలంగాణ
అక్షరాలతో అలవోకగా అందించిన
కవిత్వం చైతన్య గీతం
సకల విజ్ఞాన సర్వస్వ మూర్తి



**-పత్తి శివప్రసాద్,** 9440001224

## జయాపజయాలు

ఏడుస్తూనే జనంలోకి వచ్చాం
ఏడిపిస్తూనే టా టా చెప్పి పోదాం
'నో' చెప్పడం అపజయం కానే కాదు
'ఎస్' అనడం సదా జయాన్ని ఇవ్వదు !
జీవితం ఓ సాహస పోరాటం
ఏం జరుగుతుందో తెలియదు
అదే జరగాలనే ఆరాటం..
పోరాట ఆరాటాల నడుమ..
సయ్యాటే సమస్త జీవనయానం !.
సమస్యలపై దృష్టి పెట్టకు..
పరిష్కార మార్గాల్ని వెతుకు
ఒకే సమస్యకు వందల సార్లు..
ఏడ్చి కన్నీటిని వ్యర్థం చేయకు !.
జీవిత ప్రయాణంలో తుఫాన్లు..
మనల్ని కుదిపేయడానికే కాదు
మన నడిచే రహదారిని..
క్లియర్ చేయడానికి కూడా !.
నీలో నవ్వుల పువ్వులు నింపేవాడు..
బాధల నిశీధిలో వెలుగులు చిమ్మే వాడు..
నీతో నీడలా సదా నడిచే వాడు..
స్నేహితుడైతే నీవే అదృష్టవంతుడివి !.
మాట తీరు అందలమెక్కిస్తుంది
నోరు జారితే ప్రళయం వస్తుంది
అందరి మన్ననలు పొందాలని..
అడుగడుగునా ఓడుతున్నాడు నరుడు !.
జీవన పోరులో మూడు నీటి ఊటలు..
కష్ట నష్టాల్లో కన్నీటి వరదలు
సుఖ సంతోషాల్లో ఆనందభాష్పాలు
లక్ష్య సాధనకు చెమటను నమ్మడం !
కన్నీరు కార్చితే ఓటమి గెలుపు కాదు
కన్నీటి ధారలకు ధీటైన సమాధానం..
దాన్ని చెమట వరదగా మార్చడమే
నేటి చెమటే రేపటి ఆనందభాష్పాల ఊట !.
ఎదుటి వారి నవ్వులో..
నీ సంతోషాన్ని వెదకకు
నేడు నవ్విన వాడు..
రేపు ఏడ్వడన్న గ్యారంటీ లేదు !



**-మధుపాళీ**
9949700037

## పావుల


నా నాయకుల విన్యాసాల
మైకుల వాకిట
నోటికి పలుకుల మత్తును
గాలిలో వెదజల్లుతున్నారు?
గల్లీ చౌరస్తాలో
చోర్ బజార్లలా
చెవుల్లో గింగిరాలు కొడుతూ
వాగ్దానాల వర్ణరంజిత
తాకాలు ఎగరేస్తున్నారు.
"నేను సేవకుడిని?"
అంటూ చేతులు జోడిస్తాడు,
"నేనే నీతిమంతుడిని?"
అంటూ ప్రమాణాల కొలతలు
తూకం వేస్తున్నాడు?.
కానీ పలుకుల్లో పంచదార,
పనుల్లో మాత్రం కరువైన కరుణ.
ఓటు ముందు
ప్రజల గడప దాటే పాదాలు,
ఓటు తర్వాత
ప్రజలే చేరలేని ప్రాకారాలు.
అయినా?పావులైన ఓటర్లో
నిఖారసైన నిర్ణయం
విత్తనం వేసుకుంటూ
గంభీరంగా పెరుగుతోంది.
నవ్వుతూ వినిపిస్తున్నా
లోపల లెక్కలు వేసుకుంటున్నాడు,
అడుగులు వేసేటప్పుడు
మనసు మాత్రం మౌనంగా
తీర్పు రాస్తోంది.
రహస్య ఆలోచనలు
నాయకుడికి అంతుచిక్కకుండా,
నిశ్శబ్ద గళం
గర్జనగా మారే క్షణం కోసం
వేచి ఉంది.
బ్యాలెట్ బాక్స్ ముందు
వణుకని వేలి,
కానీ
చరిత్రను వ్రాసే శక్తి.
ఓటును పదిలపరుచుకుంటూ
నిర్ణయాన్ని ముద్రిస్తాడు ?
పావు కాదు అతడు,
అతడే అసలైన రాజు!
మాటల మాయాజాలం
కరిగిపోయినప్పుడు
నిజం నిలబడుతుంది...
అధికారపు అద్దం పగిలినప్పుడు
ప్రజల ప్రతిబింబమే మిగులుతుంది.
ఎందుకంటే
నాయకుడి విన్యాసాల కంటే
ఓటరుని మౌనం
అత్యంత ఘోషగాలిపే తీర్పు!



**-ఎలగొండ రవి**
9848770345

పుస్తక సమీక్ష

# పాడు కునేందుకు ఈ భక్తితత్వం కీర్తనలు




ప్రతులకు: 5-6, బి.సి. బాలుర హాస్టల్ ఎదురుగా, మల్లికార్జున నగర్, అలియాబాద్-షామీర్‌పేట(మం) రంగారెడ్డి జిల్లా.

భక్తి తత్వ కీర్తనలు పేరిట భృంగాచల వంగరి నారాయణాచార్యులు గారు అందించిన రచనల్లో చాలా రచనలు హాయి గా పాడుకుని ఆనందించే రీతిగా వుండటం ఒక విశేషంగా చెప్పాలి. ఈ కీర్తనల్లో రెండు భాగాలుగా కనిపిస్తాయి. ఒకటి భక్తి కీర్తనలు, రెండవది తత్వ కీర్తనలు. చాలా కీర్తనలను నారాయణాచార్యులు గారు తెలుగు సినిమా బాణీలను ఎంచుకుని వ్రాయడం జరిగింది. **"నిన్న కనిపించింది నన్ను మురి పించింది"** అను సినీ గీతానికి **"మన వంగరివారు స్వామి కనిపి ంచిండు, సొగసు చూపించిండు, మనసు ఆనంద సాగరమున ముంచేసిండు"** అంటూ రాసారు. "పయనించే ఓ చిలుకా ఎగిరిపో" అన్న పాటకు, **"కరుణించే ఓదేవా మరువకు- దరిజేర్చుక మము బాపూ"** అంటూ కలం కదిలించారు. **"ప్రేమ యాత్రలకు బృందా వనము"** అన్న రచనలకు పారడీగా వీరు తీర్థ యాత్రలకు తిరుప తుండగ- విహార యాత్రలు యెందుకో అంటూ అందించారు. **పగలే వెన్నెల- జగమే ఊయల** అన్న **పాటకు హిమగిరి వాస- ఉమా మహేశా, శశిధరేం ద్రాహే- శివశంకరా** అంటూ రాసిన గీతం బాగుంది. అయితే ఈ రచనల్ని ముఖ్యంగా అంతటా భక్తి భావం మెండుగా కనబడుతుంది. అయితే ఈ పాటలూ, ఈ గీతాలూ వారి నోట వింటేనే రంజుగా వుంటుంది. కొన్ని కొన్ని పాటలూ, మనము కూడా ఇట్టె హాయిగా పాడుకునే రీతిగా వున్నాయి. జయంబు నిశ్చయంబురా భయంబు లేదురా అన్న పాటకు వీరు రాసిన బాణీ ముక్తి నిశ్చయంబురా, భయంబు లేదురా అంటూ పసందుగా అందించారు. ఏది ఏమైనా ఈ పుస్తకం నిండా ఆధ్యాత్మిక భావ పరంపర దండిగా దర్శనమిస్తుంది.

ధనము శాశ్వతంబు కాదు, తనువు శాశ్వతంబు కాదు దినము దినము రామ మంత్రం పఠన శాశ్వతమ్ము రామ అంటూనే ఎన్నో భక్తి ప్రబోధ గీతాలున్నాయి దండిగా. ఇదొక మంచి కీర్తనల గ్రంథం.



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1730వ రోజు 'సంఘటిత శక్తి' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'సంఘటిత శక్తి' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**

అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



## పిడికిలి బిగిస్తే

చీమలన్ని కూడి పుట్టబెట్టినట్టు
గడ్డి పరికలన్ని చేరి తాడుగా మారి
ఏనుగులను బంధించినట్టు
కలిసి ఉంటే కలదు సుఖం.
భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం
ఎన్నో వర్ణాలు
ఎన్నో వర్గాలు
ఎన్నో మతాలు
మానవత్వం పరిమళిస్తున్న వైనం.
చేతికి ఐదు వేళ్ళు
కలిపి పిడికిలి బిగిస్తే
బలం కొండలు పిండి కొట్టే అంత
పిడిగుద్దుతో ఎదుటివాని శక్తిని
బలహీనం చేయడం.
మనిషి ఒక్కడే
వృత్తులు వేరు
అందరూ ఎవరి పని వారు
చేస్తేనే
అభివృద్ధిపథంలో నిలుస్తుంది
దేశం
ఐకమత్యమే మహా బలం!!.
సప్తవర్ణ శోభితమైన పూలు
ఒకచోట చేరి దండగా మారి
దేవుని మెడలో చేరుతాయి
ఒక్కటైన సంఘటిత శక్తి
అనురాగానికి పునాది
శాంతికి వారధి!!.

**-డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి**

## ఐక్యత

తోడు లేనిదే
నీడ కూడా కనపడదు
మనిషి రూపురేఖలకు
అనేక యంత్రావయవాలకు
సఖ్యత కుదిరించి
సమైక్యంగా అమర్చిన ప్రాణం
మనిషి
మనిషి నిర్మాణ వ్యవస్థలో
ఏ ఒక్క అవయవం సమైక్యత
లేకుంటే
కుంటుపడుతుంది జీవితం
బోల్తా పడుతుంది బతుకు బండి.
యుద్ధానికి సిద్ధమైనప్పుడు
సందర్భం సమయం ఆయుధం
స్థలం
అన్నీ సమైక్యంగా కలిసి వస్తేనే
కార్య విజయం.
ఆలోచనలకు
ఆచరణ సహకారం లేకపోతే
మానవ మనుగడకు
మార్గం దూరం.
గడ్డి పోచ పై గడుసులుంటాయి
తోడుగుడ్డిగా ముట్టుకుంటే
కాటేస్తది గట్టిగా.
మంచికైనా చెడు కైనా
మాట మాట కలిస్తే గొడవ
చేయి చేయి కలిస్తే యుద్ధం
చినుకు చినుకు కలిస్తే వర్షం
సమయం సందర్భం కలిస్తే
కార్యం సిద్ధం.
ఒంటరి పోరుకైనా
మనో ధైర్యం ఆలోచనలు
సందర్భం సమయం
కలిస్తేనే విజయం.

**- పొన్నాల ధనమ్మ**

## సంఘం శరణం గచ్ఛామి

ఒక మహత్తర కార్యాన్ని
'నేను' చెయ్యలేకపోవచ్చు
'మనం' తప్పక చెయ్యగలం
సంఘజీవియైన
మనిషి శ్రేయస్సు
కలిసిమెలిసి జీవించడం లోనే
ప్రతి వ్యక్తి
మానసిక శారీరక స్వస్థత
ప్రకృతికి స్వచ్ఛతనిస్తుంది
నేటి మన సంతులిత భోజనం.
రేపటి తరాల కడుపునింపుతుంది
'మనం' అనే మనఃకాసారంలో
'నేను' అనే భావన
తన నీడను చూసుకోగలిగితే
ఎంత బాగుంటుంది
వ్యక్తులందరూ కలిసి
సామూహిక శక్తియై
ఆరోగ్య సమాజమై
చిదానంద స్వరూపమై
చిరకాలం నర్తిస్తుంది.

**-ముద్దు వెంకటలక్ష్మి**

## లోకహితం

శక్తీ యుక్తితో కూడిన
సంఘటితశక్తి
మరుగున పడిపోతున్నది
స్వార్థాహంకారంతో
అణగారిన మేధాశక్తి
కోల్పోతున్నది సమున్నత శక్తి.
ప్రకృతి ఒడిలో ఒదిగిన శక్తి
అణువణువునా నిండిన
అంతర్నిర్మిత యుక్తి
అవనిపై అవతరించిన
అద్భుత శక్తి
స్వాతంత్రేచ్ఛను సాధించిన
ధీశక్తి..
ఐకమత్యమే మన బలమంటూ
చాటిన హితోక్తులు
కాలకూట విషంలా
వ్యాపిస్తున్నాయి
అసూయా ద్వేషాల వివక్షతలు
వర్గ వర్ణ వైషమ్యాలతో
కార్చిచ్చులా
దహించివేస్తున్నాయి
అసంఘటిత శక్తులు.
చిన్న చిన్న ప్రాణులు సైతం
సమిష్టి కృషితో ఏదైనా సాధ్యం
అంటూ
నిరూపించినా
ఒంటరియైపోతున్నాడు
స్వావలంబనలో ఉన్న
ఆనందాన్ని మరిచి
పరాన్నభుక్కుగా
మిగిలిపోతున్నాడు నిష్క్రియుడై.
మాటలతో
తూటాలను సంధిస్తున్నాడు
రణభేరిని మోగిస్తున్నాడు
అధికార దాహంతో
ప్రపంచాన్ని వణికిస్తున్నాడు
వాదాల భేధాలతో
అసాంఘిక చర్యలతో తనకు తానే
విపత్తులను కొని
తెచ్చుకుంటున్నాడు.
మారాలీ మనిషి!
సంఘటన శక్తితోనే అసాధ్యాన్ని
సుసాధ్యం చేయవచ్చని
భిన్నత్వంలో ఏకత్వం
ప్రతి వ్యక్తి సిద్ధాంతమవ్వాలని..

**- పి.పద్మావతి**

## శక్తితో నిలువు

సమాజానికి సౌరభం
సంఘటిత శక్తియే
అది జీవనానికి పునాది
భవిష్యత్తుకు నాంది.
సౌజన్య శీలురుగా
సౌకుమార రూపులుగా
జీవితంలో ఎదుగాలంటే
సంఘంతో నిలవాలి.
పేరు ప్రతిష్టలంటూనే
సంఘంతో నడిచి
గౌరవప్రదంగా ఉండాలని
ఆశపడే జీవితాలు
లౌకిక యుక్తి తో నిలిచి
శక్తి సామర్థ్యాలు నిలిపి
ఆనందపు ఊహలతో
తేలిపోతాయి.
గొప్పవారు కావాలి
జీవితాన్ని నిలపాలి
పదిమంది మనలోన
నిలవాలి అంటాం.
శక్తి యుక్తులు యుంటేనే
తెలివిగల వారిమవుతాం
కొంగొత్త దారులతో
సమష్టి శక్తిగా నిలిచిపోతాం.

**-వి. సంధ్యారాణి**

## భిన్నత్వంలో ఏకత్వం

భిన్నమైన ఏడు వర్ణాలు
కలగలిపితే ఉదయిస్తుంది
శ్వేతవర్ణం!.
మానవత్వ దారంతో
అల్లిన విభిన్న వర్ణాలు
జాతులూ కులమతాల పూదండ
దేశమాత కంఠసీమపై
అలంకరించిన హారం!.
వైషమ్యాలు, వైరుధ్యాలు
ఎరుగని అంకితభావం
మనలో ఉదయించిననాడే
దేశానికి మహోదయం!.
భిన్నత్వంలో ఏకత్వాన్ని
విడదీసేందుకు
విచ్ఛిన్నం చేసేందుకు
స్వార్థపర శక్తులెన్ని
కుయుక్తులు పన్నినా
కుతంత్రాలు రచించినా
కట్టగట్టుకు వచ్చినా
ఐక్యతతో
ఆత్మస్థైర్యంతో
శత్రువులను
ఎదిరించి నిలవాలి..
మన దేశ ఔన్నత్యాన్ని
దశదిశలా చాటాలి!.

**-చంద్రకళ దీకొండ**

## ఐక్యతే అసలైన శక్తి.

ఒంటరి దీపానికి వెలుగెంత?
చిరుచీకటిని చెదరగొట్టే రవ్వంత
వేల దీపాల వరుసల వెలుగెంత?
రవి ఉదయించే ప్రకాశమంత
రాత్రి రాజ్యాన్ని జయించగల
మహా సైన్యమంత.
ఒంటరి చినుకు భూమిని తాకితే
ఎంత.. చల్లని తుంపరంత.
అనేక చినుకులు కలిసివస్తే
ఆకాశం కమ్మే వర్షమంత.
చేతులు చేతులు కలిసిన వేళ
చరిత్ర కదిలే శక్తిమంతం.
ఒక గడ్డి తాడు గాలివానకు
తెగిపోయేటంత బలహీనం
వేల తాడులు వలయమైతే
అదే సంఘటిత బలం
ఒక్కొక్కటి చిన్నదైనా
కలిస్తేనే మహాశక్తిమంతం.
ఒక్క బిందువుతో సముద్రమా?
అది కథల్లోనే సాధ్యం
అనేక బిందువులు కలిసినపుడే
అలల గర్జన
అదే సముద్ర స్వరూపం
అదే సహకార సౌందర్యం .
గ్రామ గౌరవం నిలవాలంటే
పల్లెజనం ఒక్కటవ్వాలి
దేశ మహిమ నిలవాలంటే
ప్రజల శక్తి కలిసిరావాలి
మనసులు మైత్రి మంత్రం జపిస్తే
విజయ మార్గం సులభం.
సహకారం అనే సస్యబీజం
గుండెలలో నాటితేనే
ఐక్యత అనే మహా వృక్షం
సమాజానికి నీడనిస్తుంది
స్వార్థపు గోడలు కూలిపోతేనే
సోదరతత్వం విరజిమ్ముతుంది.
చేయి చేయి కలిసినపుడు
పర్వతాలు కూడా కదులుతాయి
స్వరమూ స్వరమూ కలిసినపుడే
అన్యాయం కంపిస్తుంది
అదే సమూహ సంకల్పం.
అందుకే..
స్నేహసీమలు సాగుచేద్దాం
ఐక్యతా గీతాలు ఆలపిద్దాం
మనసులను ఒకే మాలగా కట్టి
సంఘటిత మార్గం నిర్మిద్దాం.
ఎందుకంటే..
ఒక్కరి శక్తి ఒక చినుకంతే
అందరి శక్తి అఖండ
సముద్రమంత
అదే సమాజానికి కావలసిన
ఐక్యశక్తి సౌందర్యం.

**-నాగరాజు చుందూరి**

